# హైదరాబాద్‌లో జల విలయం-పాలకుల దోపిడీ, నిర్లక్ష్య విధానాల ఫలితమే

**గతంలో** ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో ఇటీవల భారీ వర్షాలు పడ్డాయి. సర్కారు సన్నద్ధత సరిగ్గా లేకపోవడంతో వరదల్లో ప్రాణ, ఆస్థి, పంట నష్టాలూ పెద్ద ఎత్తున చోటుచేసుకున్నాయి.

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు మూడు వేలకు పైగా కాలనీలు నీట మునిగాయి. హైదరాబాద్‌తో సహా మొత్తం తెలంగాణలో సుమారు 100 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిది లక్షల ఎకరాల పంట నీట మునిగింది. మంత్రులు అధికారులు దీనిని ప్రకృతి విలయంగా చూపెట్టే ప్రయత్నం చేశారు; కంటి తుడుపు, ప్రజాకర్షక ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ ప్రజలు మాత్రం భయంకరమైన కష్టాలను అనుభవించారు. రోజుల తరబడి కాలనీలు నీట మునిగి ఉన్నాయి. ప్రజల ఉపాధిని కరోనా దెబ్బతీస్తే, అనేక కాలనీలలోని ప్రజల సర్వస్వాన్నీ ఈ వర్షాలు దెబ్బతీశాయి. కార్మికులు, మధ్య తరగతి ప్రజలు, చిన్న పరిశ్రమదారులు, రోడ్డు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

మార్కెట్ యార్డులకు తెచ్చిన ధాన్యం, కళ్ళాలోని పంటలు నీటమునిగాయి. అకాల వర్షాలవల్ల తెలంగాణాలో పంటలకు దాదాపు 10,000 కోట్ల రూ॥ నష్టం జరిగింది.

1963లో మూసీ నది ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి దాని చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండు లక్షల 36 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టు గుండా ప్రవహించింది. 1908లో మూసీ నదికి భారీ వరదలు రావడంతో అప్పుడు ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్యద్వారా రూపొందించిన నగర ప్రణాళిక ఫలితంగా హైదరాబాద్ నగరం వరద భయ రహిత నగరంగా మారింది. అప్పుడు 55 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల నగరం కోసం డ్రయినేజి, నీటిపారుదల వ్యవస్థను రూపొందించారు. ఈ శతాబ్దంలో 635 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల నగరంగా విస్తరించింది. కానీ నాటి మౌలిక వసతులను కాపాడుకొంటూ విస్తరింప చేసేలా కాకుండా పాలకుల కృత్రిమ, స్వార్ధ పట్టణీకరణ విధానాలు, నాటి నగర మౌలిక వ్యవస్థలను ధ్వంసం చేసేలా సాగుతున్నాయి.

2000 సం॥ వరదలు అనంతరం ప్రభుత్వం వేసిన కిర్లోస్కర్ కమిటీ 2003లో ఇచ్చిన నివేదికలో భవిష్యత్‌లో వరదల నివారణకు వివిధ సూచనలతో పాటు 399 కిలోమీటర్ల మేర డ్రైయిన్‌లపై 13500 అక్రమ కట్టడాలను గుర్తించి, వాటిని తొలగించాలని, నాలాలను అభివృద్ధి పరచాలని చెప్పింది. 2016 నాటికి ఈ అక్రమ కట్టడాల సంఖ్య 28 వేలకు పెరిగింది. రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఇంజినీర్ల కమిటీ తక్షణం తొలగించాల్సిన 12 వేల కట్టడాలను గుర్తించి వాటి తొలగింపుకు 12 వేల కోట్లు ఖర్చు అంచనా వేసింది. 20 శాతం పని జరిగిందో లేదో రాజకీయ నాయకత్వ ఒత్తిడితో ఆ కార్యక్రమం నిలిచిపోయింది.

తెలంగాణాలో అత్యధిక భూభాగం కృష్ణ, గోదావరి నదుల మధ్య విస్తరించి ఉంది. తెలంగాణా భూమి కొంత కృష్ణ వైపు మరికొంత గోదావరి వైపు వాలి ఉంటుంది. ఎంత పెద్ద వర్షం పడ్డా నీరు మొత్తం ఒకటి రెండు రోజుల్లో సహజంగా వాలుకు ప్రవహించి ఆ నదుల్లో కలుస్తుంది. దక్కన్ ప్రాంత పరిస్థితిని దృష్టిలో ఉంచుకోని సాగునీరూ, మంచినీటి అవసరాలు, వరద నివారణలకు గొలుసుకట్టు చెరువుల నిర్మాణాన్ని కాకతీయుల కాలం నాటికే పాలకులు అభివృద్ధి చేశారు. వాటినే నిజాం పాలకులు తమ రెవిన్యూ కోసం కొనసాగించారు. కాని ఈనాడు హైదరాబాద్‌లోని అనేక చెరువులు ఆక్రమణలకు గురికావడమో, రూపురేఖలు మారి పోవడమో, నగర, పారిశ్రామిక వ్యర్ధ పదార్థాల కూపాలుగా మారడమో జరిగింది. గొలుసుకట్టు చెరువు నిర్మాణాల అలుగులు, ఒక చెరువు నుంచి మరో చెరువుకు సాగే నాలాలు ఆక్రమణలకు గురైనాయి. గంటకు 40 మిల్లీమీటర్లు వర్షం పడినా తట్టుకునే విధంగా నాలాలు విస్తరించాలని ఎన్‌డీఎంఏ సూచనలు చేసింది. వాటిని పాటించి ఉంటే విపత్తు ఇంత తీవ్రంగా ఉండేది కాదు. నాలాల్లో ఏటా పూడికను తీసి, రిటైనింగ్ వాల్స్ పటిష్టం చేసి, సరిపడ ఔట్‌లెట్‌లు పెట్టాలి. హైదరాబాద్‌లో వర్షపునీరు 13 ప్రధాన నాలాల ద్వారా మూసీలో కలుస్తుంది. సహజంగా ఏర్పడిన వాగులు, పిల్ల కాలువలు డ్రయినేజి మురికిని తమలో కలుపు కుంటున్నాయి. నగరాన్ని విస్తరింపజేసుకుంటూ ఆ సహజ ప్రవాహాలను అడ్డుకున్నందుకే ఇప్పుడు ఎక్కువ నష్టం వాటిల్లింది. మొత్తం హైదరాబాద్‌లో 180 చెరువులు, వరంగల్‌లో 58 చెరువులు రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుత వరదలలో సంపన్న వర్గాల, రాజకీయ పలుకు బడికల వారి గేటెడ్ కమ్యూనిటీల కోసం అధికారులు కొన్ని చోట్ల చెరువులకు గండి పెట్టి పేద, మధ్యతరగతి ప్రజల కాలనీలను ముంచారు.

పైకి ఇది ప్రకృతి విలయంగా కనిపిస్తోంది. కానీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కలిగించిన పర్యావరణ విధ్వంసం మహా నగరాలన్నిటిని భారీ విపత్తులకు గురిచేస్తున్నది. బొంబాయి, చెన్నైల కోవలోకి హైదరాబాద్ నగరం కూడా చేరింది. సామ్రాజ్యవాదం, ప్రపంచ బ్యాంకుల పథకం ప్రకారం పాలకులు వ్యవసాయ రంగాన్ని కొల్లగొట్టి, గ్రామీణ ప్రాంతాలను కునారిల్లేలా చేసే చర్యలు చేపట్టారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో స్వతంత్రంగా ఉత్పాదకశక్తుల పెరుగుదలను మందగింప చేసి సేవా, వాణిజ్య రంగాలకు ప్రోత్సాహం కల్పిస్తూ అందుకు తగ్గ కేంద్రాలుగా కృత్రిమమైన, వేగవంతమైన పట్టణీకరణకు చర్యలు తీసుకున్నారు. "అభివృద్ధి" అని పాలకులు పిలిచే దానికి గ్రోత్ ఇంజన్‌లుగా నగరాలను అభివర్ణించారు. గ్రామాలనుంచి సాగే వలసలవల్ల దొరికే చౌక కూలీల చెమట, నెత్తురులే ఈ గ్రోత్ ఇంజన్‌లలో వాడే ఇంధనం. నగరాలలో మౌలిక వసతుల కల్పన బాధ్యతను పాలకులు కావాలని విస్మరించి వాటిని ప్రైవేటు దోపిడీ వర్గాల కోసం వదిలారు. ఫలితంగా పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారి నిరంకుశ పెట్టుబడిదారులైన కాంట్రాక్టర్‌లు, ఈ పట్టణీకరణ ఫలితాల వల్ల లాభం పొందారు. అసంఖ్యాక పేద, మధ్యతరగతి, కార్మిక ప్రజానీకం అటు పెట్టుబడిదారుల, కాంట్రాక్టర్ల దోపిడికి గురవుతూనే అస్తు బిస్తు జీవితాలతో ఆశ నిరాశల మధ్య బతుకుతున్నారు. నిరంకుశ పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలకు దోచి పెట్టడమే అభివృద్ధిగా చిత్రిస్తూ మెట్రో రైళ్లు, ఫ్లయి ఓవర్లు, భారీ నిర్మాణాలకోసం అన్ని నియమాలను ఉల్లంఘిస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధికోసం ఐదేళ్లలో రూ. 67 వేల కోట్లు ఖర్చు చేశామని కేటీఆర్ చెబుతున్నారు. 2050 సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామంటున్నారు. హైదరాబాద్‌కు తాము చేసిన ప్రగతి నివేదిక ఇస్తామని అన్నారు. రాబోయే జిహెచ్‌యంసి ఎన్నికలలో గెలుపు కోసం అధికార పార్టీ ఈ నివేదికలు విడుదల చేసే లోగానే వారి బండారం బయటపడింది.

కనుక హైదరాబాద్ ప్రస్తుత వరదలలో ప్రజల బాధలకు కారణం, పాలకుల దోపిడీ విధానాలలోనే వుంది. పేద, మధ్య తరగతి ప్రజల విషయంలో అక్రమ కట్టడం అని నిర్ధారణ జరిగేతే దానికి ప్రభుత్వానిదే బాధ్యతగా గుర్తించి సమగ్ర పునరావాసం కల్పించాలని పోరాడాలి. సమాజ మౌలిక మార్పు తోనే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని అర్ధం చేసుకొంటూ, ప్రస్తుత ఈ పరిస్థితులలో వరదల నష్ట నివారణకు, భద్రతకు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలి.